RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్

ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | మంగళవారం, జూన్ 30, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 69 | పేజీలు: 8 | వెల : రూ.1



మన వరంగల్ వసీ
మహేష్ దీక్షిత్ కొత్త ఐబీ ఛీఫ్

# నేడు శిల్పకళా వేదికలో రైతు భరోసా పంపిణీ సదస్సు

## రాష్ట్రవ్యాప్తంగా రైతుల భాగస్వామ్యంతో కార్యక్రమం

హైదరాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే):లి తెలంగాణ రైతులకు పెట్టుబడి సాయంగా అందించే లిరైతు భరోసా పంపిణీ సదస్సులి నేడు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొదట ఈ రైతు ఆశీర్వాద సభను ఖమ్మం జిల్లా మధిర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా, రాష్ట్రవ్యాప్తంగా రైతుల భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టారు. నేడు సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల రైతులు ప్రత్యక్షంగా పాల్గొననుండగా, రైతు వేదికల ద్వారా వేలాది మంది రైతులు వర్చువల్‌గా అనుసంధానం కానున్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా పథకం అమలు, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు, రైతు సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు. రైతుల ఆర్థిక భరోసా, వ్యవసాయాభివృద్ధి, పంటల ఉత్పాదకత పెంపుపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా వివరించనున్నట్లు సమాచారం. రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించి వ్యవసాయ వ్యయభారాన్ని తగ్గించడం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.





## ఘనంగా బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనం

హైదరాబాద్ :వాయిస్ టుడే : హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీజేపీ తెలంగాణ బూత్ అధ్యక్షుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, దేశ సేవ కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. "వికసిత భారత్" లక్ష్య సాధనలో భాగంగా తెలంగాణలోని ప్రతి బూత్‌లో కమలం వికసించేలా శ్రమించాలని సూచించారు. ఆయన ప్రసంగం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు. సమ్మేళనంలో ప్రసంగించిన నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వరంగల్ నగరంపై ఉన్న ప్రత్యేక అభిమానం గురించి ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం వరంగల్ అభివృద్ధి కోసం సుమారు రూ.17 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిందని తెలిపారు. మోదీ ప్రభుత్వ హయాంలో వరంగల్‌లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాకతీయుల సంస్కృతి ప్రతిబింబించేలా వరంగల్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి, కాజీపేటలో రైల్వే తయారీ కేంద్రం ఏర్పాటు, వేయిస్తంభాల దేవాలయంలో కళ్యాణ మండపం పునరుద్ధరణ, జాతీయ రహదారుల విస్తరణ ద్వారా

(మిగతా 2వ పేజీలో)



## బీఆర్ఎస్ దోపిడీతో తెలంగాణ విధ్వంసం

లక్షల కోట్ల అప్పులు మిగిల్చిన బీఆర్ఎస్

మాధవ సేవ - మానవ సేవే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రాన్ని మేము నెంబర్ వన్ గా నిలబెడతాం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

# డ్రైవింగ్ లైసెన్స్ ఇక కష్టం

హైదరాబాద్ జూన్ 29, (వాయిస్‌టుడే) : వాహనదారులకు అలర్ట్.. ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ పొందడం అంత సులువు కాదు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, వాహనదారులలో ట్రాఫిక్ నియమాలపై పూర్తి అవగాహన పెంచడానికి రవాణాశాఖ సరికొత్త నిబంధనలను తీసుకువస్తోంది. గతంలో లాగా కేవలం వెహికల్ నడపడం వస్తే సరిపోదు. ఇకనుంచి ఆర్టీఏ నిబంధనల ప్రకారం అగ్నిపరీక్షలు పాస్ కావాల్సిందే. ఇందుకోసం రవాణాశాఖ సరికొత్త విధివిధానాలను రూపొందిస్తోంది. ఈ కొత్త విధానం ప్రకారం లైసెన్స్ ప్రక్రియ ఎలా ఉండబోతుందో ఇక్కడ తెలుసుకుందాం.

**కొత్త పరీక్షల విధానం:**

మొదటి దశ : ఎల్‌ఎల్‌ఆర్ కోసం స్లాట్ బుక్ చేసుకుని, ఆన్‌లైన్ పరీక్షలో పాస్ కావాలి. ఇందులో ట్రాఫిక్ నియమాలపై కనీస అవగాహనను పరీక్షిస్తారు.

2 ఆన్‌లైన్ టెస్టులు: ఎల్‌ఎల్‌ఆర్ వచ్చిన తర్వాత, తుది డ్రైవింగ్ టెస్ట్‌కు వెళ్లే లోపు అభ్యర్థులు మరో రెండు ఆన్‌లైన్ పరీక్షలు అటెండ్ అయ్యి, పాస్ కావాల్సి ఉంటుంది. వీటిని అభ్యర్థులు తమ

(మిగతా 2వ పేజీలో)





## మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది

### అభివృద్ధి-మానవీయత రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతాం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్ 29 (వాయిస్ టుడే):లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార-- పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే చారిత్రాత్మక ప్రాజెక్ట్‌గా ఇది నిలవనుందని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సోమవారం మూసి పునరుజ్జీవ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం, పరిహారం తదితర అంశాలపై ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈ.వి. నర్సింహారెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మూసి నదిని పునరుజ్జీవింపజేసి హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి అని అన్నారు. ఈ ప్రాజెక్ట్ కేవలం అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, పర్యావరణహిత జీవన వాతావరణాన్ని అందించే మహత్తర సంకల్పమని పేర్కొన్నారు. దశాబ్దాలుగా మూసి నది కాలుష్యంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వరదల సమయంలో పరివాహక ప్రాంత ప్రజలు తీవ్ర కష్టాలను అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, ఆధునిక రహదారులు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాల ఏర్పాటు ద్వారా మూసి పరివాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని

(మిగతా 2వ పేజీలో)

## తెలంగాణను ప్రపంచ బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దుతాం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 29 (వాయిస్ టుడే):లి తెలంగాణలో బియ్యం ఎగుమతులను భారీ స్థాయిలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రాన్ని దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయి బియ్యం ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో కేసీపీ న్యూట్రీ సంస్థ రూపొందించిన మల్టీ విటమిన్ రైస్ ఉత్పత్తులను సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న బియ్యానికి దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందే తప్ప ఎగుమతుల కోసం కాదని, అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానంతో బియ్యం ఎగుమతులను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపడుతోందని తెలిపారు. రైతులు, రైస్ మిల్లర్లకు మరింత ఆదాయం చేకూరేలా దేశీయ, విదేశీ మార్కెట్లను లక్ష్యంగా చేసుకుని కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎగుమతులు చేపట్టే పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం

(మిగతా 2వ పేజీలో)



## సింగపూర్ కాన్సులేట్ జనరల్ ఎడ్గర్ పాంగ్‌తే చియాంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ

### సింగపూర్‌తో ఏపీ భాగస్వామ్యం బలోపేతంపై చర్చ

ఉండవల్లి: చెన్నైలోని సింగపూర్ కాన్సులేట్ జనరల్ ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ తో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

మంగళవారం, జూన్ 30, 2026

# తెలంగాణను ప్రపంచ బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దుతాం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అందిస్తుందని, అవసరమైన అనుమతులను వేగవంతంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఫోర్టిఫైడ్ రైస్, మల్టీ విటమిన్ రైస్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉందని, ఈ అవకాశాన్ని తెలంగాణ పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




**ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ అగ్రస్థానం**

ఈ ఏడాది యాసంగి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని మంత్రి తెలిపారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు జరిగిందని పేర్కొన్నారు. ఇది తెలంగాణ రైతుల శ్రమకు, ప్రభుత్వ రైతు అనుకూల విధానాలకు నిదర్శనమని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్ల కోసం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ఇప్పటికే రూ.19,303 కోట్లను నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. పారదర్శకతతో, వేగవంతంగా చెల్లింపులు జరిపిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. వానాకాలం, యాసంగి సీజన్లను కలిపి రాష్ట్రంలో బియ్యం ఉత్పత్తి 300 లక్షల మెట్రిక్ టన్నులు దాటిందని, రాష్ట్ర అవసరాలు సంవత్సరానికి కేవలం 36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉండటంతో తెలంగాణ మిగులు బియ్యం ఉత్పత్తి రాష్ట్రంగా ఎదిగిందని వివరించారు.

**విలువ జోడింపుతో రైతులకు రెట్టింపు లాభాలు**

రైస్ పరిశ్రమ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. మల్టీ విటమిన్ రైస్, ఫోర్టిఫైడ్ రైస్ వంటి ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు ఎగుమతుల ద్వారా అధిక ఆదాయం తెచ్చిపెడతాయని తెలిపారు. తెలంగాణలో మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను లక్ష్యంగా చేసుకుని ఉత్పత్తులను విస్తరించాలని పరిశ్రమలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉత్పత్తులు విదేశీ మార్కెట్లలో గుర్తింపు పొందేందుకు ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు.

**సాగునీటి విప్లవంతో వ్యవసాయాభివృద్ధి**

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల విస్తరణ, ఆధునీకరణ, రైతులకు నిరంతర నీటి లభ్యత కల్పించడం వల్లే ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం చేసిన భారీ పెట్టుబడుల ఫలితంగానే తెలంగాణ దేశంలో అగ్రగామి ధాన్య ఉత్పత్తి రాష్ట్రంగా అవతరించిందన్నారు. రైతుల ఆదాయం పెరగడం, రైస్ మిల్లింగ్ పరిశ్రమ బలోపేతం కావడం, బియ్యం ఎగుమతుల ద్వారా తెలంగాణకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ దోపిడీతో తెలంగాణ విధ్వంసం

**లక్షల కోట్ల అప్పులు మిగిల్చిన బీఆర్ఎస్**

**మాధవ సేవ - మానవ సేవే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం**

**రాష్ట్రాన్ని మేము నెంబర్ వన్ గా నిలబెడతాం**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



బీఆర్ఎస్ పాలకులు ఆర్థిక, సామాజిక దోపిడీకి పాల్పడి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాలను తమ కుటుంబం కోసం తమ నలుగురి కోసం అన్నట్లుగా వదిల్లి చేశారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సంపదను నలుగురు కుటుంబ సభ్యులు దోచుకొని ఆ డబ్బుతో నాలుగు చానళ్ల పత్రికలు సోషల్ మీడియా ద్వారా అబద్ధాలు పోగేసి ప్రజా ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాడు ఉపముఖ్యమంత్రి సతీసమేతంగా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రాణప్రతిష్ట మహా కుంభాభిషేక ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి దంపతులకు వేద పండితులు, అర్చకులు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయన వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మాధవ సేవ మానవ సేవ అనే మన సంస్కృతి విలువలతో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అవసరాలు తీర్చడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నిలబెట్టగలమని భారత రాజ్యాంగం స్పష్టంగా చెబుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఇదే లక్ష్యంతో ముందుకు వెళ్తోందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై ఉప ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆనాటి ప్రభుత్వంలో ఒకరిద్దరు వ్యక్తులు రాష్ట్ర వనరులన్నింటినీ కొల్లగొట్టి, దోపిడీ చేశారని తీవ్రస్థాయిలో ఆరోపించారు. నాలుగు కోట్ల ప్రజల సంక్షేమాన్ని పక్కనబెట్టి, కేవలం నలుగురి సంక్షేమం, అభివృద్ధి కోసమే ఆనాడు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారని విమర్శించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వానికి అప్పగిస్తే.. ఆ నిధులన్నింటినీ కరిగించి మరో 8 లక్షల కోట్ల రూపాయల అప్పులను మిగిల్చారని డిప్యూటీ సీఎం ధ్వజమెత్తారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నిరుపేదల, మధ్యతరగతి కుటుంబాల అవసరాలను గుర్తిస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద ఉండకూడదనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి నాలుగు పాయింట్ ఐదు లక్షల ఇందిరమ్మ ఇండ్లను తమ ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఇందుకోసం 22,500 కోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రజా ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో కిలో రూ. 50–55 ధర ఉన్నప్పటికీ, పేద కుటుంబాల్లో ఏ ఒక్కరూ కూడా నాణ్యమైన ఆహారానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రతి వ్యక్తికి 6 కేజీల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ది పొందుతున్నాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని కొన్ని గ్రామాల్లో గ్రామాల్లో 90% కుటుంబాల కరెంట్ బిల్లు ప్రభుత్వమే ప్రతి నెల బిల్లులు చెల్లిస్తోందన్నారు. రాష్ట్రంలోని 30 లక్షల పంప్ సెట్లకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని అన్నారు. దీనికోసం సంవత్సరానికి రూ. 14,000 కోట్లను ప్రభుత్వం డిస్కమ్‌లకు చెల్లిస్తోందన్నారు. రాష్ట్ర మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. మహిళలు తీసుకునే టికెట్లకు సంబంధించిన నగదును ప్రభుత్వమే ఆర్టీసీకి చెల్లిస్తోందన్నారు. ఇప్పటివరకు దాదాపు 10,600 కోట్ల రూపాయలను ఈ పథకం కింద ఆర్టీసీకి ఆర్థిక శాఖ చెల్లించడం జరిగిందన్నారు.

# మన వరంగల్ వసీ మహేష్ దీక్షిత్ కొత్త ఐబీ చీఫ్



వరంగల్, జూన్ 29, ( వాయిస్ టుడే ):దేశ రక్షణ, అంతర్గత భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన నిఘా విభాగం ఇంటెలిజెన్స్ బ్యూరో సరికొత్త బాస్‌ను కేంద్రం నియమించింది. భారత ప్రభుత్వ అత్యున్నత నియామకాల కమిటీ దేశ రక్షణ రంగంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పోస్టుకు తెలంగాణ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ మహేష్ దీక్షిత్‌ను నియమించింది. దేశవ్యాప్తంగా ఉన్న అంతర్గత భద్రతా సవాళ్లు, సరిహద్దు ఉగ్రవాదం, సైబర్ దాడుల ముప్పు పెరిగిపోతున్న వేళ.. ప్రధాని నరేంద్ర మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ టీమ్ ఈ వ్యూహాత్మక ఎంపిక చేసింది. ఈ నియామకంతో తెలుగు రాష్ట్రాలకు, ముఖ్యంగా తెలంగాణ ఐపీఎస్ కేడర్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కినట్లయింది. క్షేత్రస్థాయిలో నిఘా ఆపరేషన్లు అత్యంత విజయవంతంగా నిర్వహించిన ట్రాక్ రికార్డ్ మహేష్ దీక్షిత్‌కు ఉంది. గతంలో దేశంలోనే అత్యంత సున్నితమైన ప్రాంతమైన జమ్మూ కాశ్మీర్‌లో ఆయన చేసిన కౌంటర్-ఇంటెలిజెన్స్ ఆపరేషన్స్ కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రశంసలు అందుకున్నాయి. షాడో ఆఫీసర్‌గా, టెక్-సావీ నిఘా నిపుణుడిగా పేరు తెచ్చుకున్న ఒక తెలుగు కేడర్ అధికారి.. దేశ రక్షణ వ్యవస్థకు గుండెకాయ లాంటి ఐబీకి చీఫ్ అయ్యారు. నూతన ఐబీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న డాక్టర్ మహేష్ దీక్షిత్ 1993 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన.. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ కేడర్ కిందకు వచ్చారు. పోలీస్ సర్వీస్‌లో జాయిన్ అయిన మొదటి రోజు నుంచే టఫ్ ఆఫీసర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. క్షేత్రస్థాయిలో లా అండ్ ఆర్డర్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా, తెరవెనుక జరిగే నేరాలను, దేశద్రోహ వ్యూహాలను ముందే పసిగట్టే ఇంటెలిజెన్స్ బ్రెయిన్ ఆయన సొంతం. కేంద్ర ప్రభుత్వ డిప్యుటేషన్‌పై ఇంటెలిజెన్స్ బ్యూరోలో అడుగుపెట్టిన తర్వాత మహేష్ దీక్షిత్ కెరీర్ గ్రాఫ్ వేగంగా పెరిగింది. ఐబీలో జాయింట్ డైరెక్టర్‌గా, అదనపు డైరెక్టర్‌గా అత్యంత కీలకమైన విభాగాలను ఆయన పర్యవేక్షించారు. 2024 సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ఆయనను ఇన్-సిటు ప్రాతిపదికన స్పెషల్ డైరెక్టర్ గా పదోన్నతి కల్పించింది. నిఘా రంగంలో దశాబ్దాల అనుభవం, క్లిష్టమైన కేసులను ఛేదించడంలో ఆయన చూపిన చొరవను గుర్తించి, ప్రస్తుత ఐబీ డైరెక్టర్ పదవీకాలం ముగిసిన తరుణంలో కేంద్రం ఆయనకు దేశ నిఘా పగ్గాలను అప్పగించింది. మహేష్ దీక్షిత్ కెరీర్‌లో జమ్మూ కశ్మీర్‌లో చేసిన సేవలే కీలకంగా మారాయి. కశ్మీర్ లోయలో ఉగ్రవాదం, సరిహద్దు దాటి వచ్చే చొరబాట్లు, లోకల్ స్లీపర్ సెల్స్ నెట్‌వర్క్ ఉధృతంగా ఉన్న సమయంలో ఆయన అక్కడ ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. టెర్రర్ ఫండింగ్ మూలాలను దెబ్బతీయడం, సరిహద్దు అవతలి నుంచి వచ్చే కోడెడ్ మెసేజ్‌లను డీకోడ్ చేయడం ద్వారా ఎన్నో భారీ ఉగ్రదాడులను ముందే భగ్నం చేయడంలో ఆయనది కీలక పాత్ర. ఆయన కాశ్మీర్‌లో ఉన్నప్పుడు సృష్టించిన హ్యూమన్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ నేటికీ నిఘా వర్గాల్లో ఒక కేస్ స్టడీగా చెబుతుంటారు. లోకల్ ఇన్ ఫార్మర్ల ద్వారా సమాచారాన్ని సేకరించడంలో, టెక్నాలజీ ఆధారిత సర్వైలెన్స్‌ను సమన్వయం చేయడంలో మాస్టర్‌మైండ్‌గా నిలిచారు. కాశ్మీర్ ఆపరేషన్లలో చూపిన ఈ అసాధారణ ప్రతిభే ఆయనను ఢిల్లీలోని నార్త్ బ్లాక్ పెద్దలకు అత్యంత నమ్మకస్తుడైన ఆఫీసర్‌గా మార్చింది. ఈ తర్వాత దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అంతర్గత నిఘా గ్రిడ్‌ను బలోపేతం చేయడంలో విశేష కృషి చేశారు. భారతదేశంలో ఇంటెలిజెన్స్ బ్యూరో అనేది దేశ అంతర్గత భద్రతను కాపాడే అత్యున్నత రహస్య నిఘా సంస్థ. విదేశీ నిఘా కోసం రా పనిచేస్తుంటే, దేశ సరిహద్దుల లోపల జరిగే విద్రోహ చర్యలు, తీవ్రవాదం, నక్సలిజం, అంతర్గత కల్లోలాలను అణిచివేయడానికి ఐబీ శ్రమిస్తుంది. అటువంటి సంస్థకు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం అంటే ముళ్ల కిరీటాన్ని ధరించడమే. ప్రస్తుత డిజిటల్ యుగంలో నూతన ఐబీ చీఫ్ మహేష్ దీక్షిత్ ముందు దాంతాదంత సవాళ్లు ఉన్నాయి. సైబర్ వార్‌ఫేర్, డిజిటల్ దాడులు, ప్రభుత్వ డేటా హ్యాకింగ్ ప్రయత్నాలు, డీప్‌ఫేక్, సోషల్ మీడియా ప్రోపగాండాకు బ్రేక్ వేయడం. దేశంలోని ప్రధాన నగరాల్లోని స్లీపర్ సెల్స్ కదలికలపై డేగకన్ను వేసి ఉంచడం ఇవన్నీ నియంత్రించడం ఆయన ముందు ఉన్న సవాళ్లు. రాబోయే రోజుల్లో దేశీయంగా, అంతర్జాతీయంగా ఎదురయ్యే సరికొత్త భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి ఒక డైనమిక్, యాక్షన్-ఓరియెంటెడ్ ఆఫీసర్ అవసరమని భావించే మహేష్ దీక్షిత్‌ను ఎంపిక చేశారు. ప్రస్తుత పొరుగు దేశాలలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతల వల్ల దేశంలో అంతర్గత శాంతిభద్రతలు అత్యంత ముఖ్యం. ఏ చిన్న ఇంటెలిజెన్స్ వైఫల్యం జరిగినా అది దేశ భద్రతకు భంగం కలిగిస్తుంది. అందుకే, దేశంలోని ప్రతి అంగుళంపై అవగాహన ఉన్న, ముఖ్యంగా కాశ్మీర్ వంటి కఠిన ప్రాంతాల్లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకలించిన అనుభవం ఉన్న దీక్షిత్ అయితేనే ఈ పదవికి న్యాయం చేయగలరని కేంద్రం గట్టిగా విశ్వసించింది.

# ఘనంగా బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనం

రోడ్డు అనుసంధానం మెరుగుదల, రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించడం, పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు, గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నాయకులు విమర్శించారు. అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవకాశవాద రాజకీయాలతో ప్రజలను మోసం చేశాయని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ప్రస్తుతం బీజేపీ వైపు ఆశతో, నమ్మకంతో చూస్తున్నారని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో అవినీతిరహిత డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ లక్ష్య సాధన కోసం బూత్ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర నాయకత్వం వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరపరాజు రాంచందర్ రావు, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్‌తో పాటు పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్

## తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది

వివరించారు. మూసి ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే తీసుకుంటామని చెప్పారు. భూ సేకరణ ప్రక్రియలో ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వ్యవహరించాలని అధికారులకు ఆదేశించారు. ఇళ్లు కోల్పోయే అర్హులైన కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వెంటనే అమలు చేయాలని సూచించారు. అలాగే భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, పూర్తి స్థాయి పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, పట్టణాభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టి, ఆర్థికాభివృద్ధి వంటి బహుముఖ ప్రయోజనాలు కలుగనున్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణ అభివృద్ధి చరిత్రలో ఈ ప్రాజెక్ట్ ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# డ్రైవింగ్ లైసెన్స్ ఇక కష్టం

ఇంటి నుంచే రాసుకోవచ్చు

**డ్రైవింగ్ టెస్ట్:** పైన పేర్కొన్న ఆన్‌లైన్ పరీక్షల్లో పాసైన వారికి మాత్రమే టెస్ట్ ట్రాక్‌పై వాహనం నడిపేందుకు అనుమతి ఇస్తారు. ఏ దశలో ఫెయిలైనా మళ్లీ పరీక్ష రాయాల్సి ఉంటుంది.

**అవగాహన వీడియోలు ఉ మార్పులు:**

వీడియోల వీక్షణ: ఆన్‌లైన్ టెస్టులు రాయడానికి ముందు అభ్యర్థులు రహదారి భద్రత, డ్రైవింగ్ మెళకువలు, అతివేగం వల్ల జరిగే నష్టాలపై రవాణాశాఖ రూపొందించిన 2 నుండి 3 గంటల నిడివి గల వీడియోలను చూడాల్సి ఉంటుంది. వాహన్ సారథి పోర్టల్: ఈ కొత్త నిబంధనలకు అనుగుణంగా త్వరలోనే 'వాహన్ సారథి' అనే పోర్టల్‌లో మార్పులు చేయనున్నారు.

**దళారుల నియంత్రణకు బయోమెట్రిక్:**

ఇకనుంచి ఏజెంట్ ల జోక్యాన్ని పూర్తిగా తగ్గించే విధంగా చర్యలు చేపట్టనున్నారు అధికారులు. టెస్ట్ ట్రాక్‌ల వద్ద ఏజెంట్లు, దళారుల జోక్యాన్ని అరికట్టడానికి, పరీక్షలు నిర్వహించకుండానే లైసెన్సులు ఇస్తున్నారనే ఆరోపణలకు చెక్ పెట్టడానికి రవాణాశాఖ బయోమెట్రిక్ (వేలిముద్రల) విధానాన్ని తప్పనిసరి చేయనుంది. మరీ ముఖ్యంగా 25 నుండి 30 ఏళ్ల లోపు యువత అజాగ్రత్త, ర్యాష్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా కాపాడటమే ఈ కొత్త విధానం యొక్క ముఖ్య ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. మరి, ఈ కొత్త నిబంధనలు ఎప్పటినుంచి అమలులోకి రానున్నాయి అనేది చూడాలి.

# సింగపూర్ కాన్సులేట్ జనరల్ ఎడ్గర్ పాంగ్‌తే చియాంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ

భేటీ అయ్యారు. ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో సింగపూర్ తో ఏపీ భాగస్వామ్యం మరింత బలోపేతంపై ఇరువురు చర్చించారు. భారత్-సింగపూర్ మధ్య సాంకేతికత, వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర సంబంధిత రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని ప్రోత్సహించడంలో ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలను మంత్రి లోకేష్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో పెట్టుబడుల గ్రౌండింగ్ పై దృష్టి సారించాం. రాష్ట్రంలో 750 పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రతి 15 రోజులకోసారి ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షిస్తున్నాం. రాష్ట్రంలో 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి కంపెనీలు ఏపీకి వచ్చాయి. రాష్ట్రంలో గతేడాది కంటే జీఎస్టీ వసూళ్లలో వృద్ధి నమోదైంది. గతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పారదర్శక విధానంలో ముందుకు వెళ్తున్నాం. సింగపూర్ తో బలమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నామని చెప్పారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు ఏపీ ఉపాధ్యాయుల బృందం వెళ్లిన విషయాన్ని లోకేష్ గుర్తుచేశారు. విద్యారంగంలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చినట్లు వివరించారు. రష్యా పర్యటన విశేషాలను పంచుకున్నారు. ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ మాట్లాడుతూ.. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ముందంజలో ఉందని.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఏపీ మంత్రుల బృందం, ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఏపీతో భాగస్వామ్యం బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

# ఆఫ్ఘన్‌పై పాక్ వైమానిక దాడులు

ఆఫ్ఘనిస్తాన్ భూభాగంపై పాకిస్తాన్ జరిపిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులతో సహా పలువురు అమాయక పౌరుల ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పాకిస్థాన్ చర్య ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని, ఇది ప్రాంతీయ శాంతికి పెను ముప్పుగా పరిణమిస్తుందని భారత్ అభిప్రాయపడింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పాకిస్థాన్ దుందుడుకు వైఖరికి, బాధ్యతారాహిత్యానికి ఈ దాడులు నిదర్శనమని పేర్కొంది. తన అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, సరిహద్దులకు ఆవల హింసకు పాల్పడుతోందని విమర్శించింది. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఆఫ్ఘన్ కుటుంబాలకు భారత్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతకు భారత్ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. పాకిస్థాన్ జరిపిన ఈ దాడుల్లో కనీసం 36 మంది పౌరులు మరణించారని, మరో 163 మంది గాయపడ్డారని తాలిబన్ డిప్యూటీ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ సోమవారం ధ్రువీకరించారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని పక్తియా, పక్తికా, కునార్ ప్రావిన్సుల్లో ఆదివారం రాత్రి ఈ దాడులు జరిగాయని ఆయన తెలిపారు. పక్తియాలోని త్సమ్కానీ జిల్లాలో ఒక నివాస గృహంపై పాక్ యుద్ధ విమానాలు బాంబులు కురిపించాయని, అనంతరం సహాయక చర్యల కోసం గ్రామస్తులు గుమిగూడిన సమయంలో రెండోసారి బాంబు దాడి జరిగిందని ఫిత్రత్ ఆరోపించారు. ఈ ఒక్క ఘటనలోనే 28 మంది గ్రామస్తులు మరణించగా, 158 మంది గాయపడ్డారని ఆయన వివరించారు.

# ఆర్య వైశ్యుల నైతిక విలువలలో ఆవిష్కరణలే ప్రధానమైనవి

## ఏ.పి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి పరిశ్రమ శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్త




హైదరాబాద్, జూన్ 29: ఆర్య వైశ్యుల నైతిక విలువలలో ఆవిష్కరణలే ప్రధానమైనవని, ఇవి యువ తరాలను సృజనాత్మకంగా ఆలోచించడానికి, వ్యవస్థాపకతలో సాహసాలు చేయడానికి ప్రోత్సహిస్తాయని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి పరిశ్రమ శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్త అన్నారు. ఆధునిక పరిశ్రమలు, ఇంక్యుబేషన్ కేంద్రాలు మరియు ఆవిష్కరణల హబ్‌లను స్థాపించడం ద్వారా, వర్ధమాన పారిశ్రామికవేత్తలుగా అద్భుతమైన ఆలోచనలను అభివృద్ధి చేసి, వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా మార్చడంలో సహాయపడుతాయని తెలిపారు. హైదరాబాద్, మాదాపూర్, హైటెక్స్. నోవొటెల్ హోటల్ లో అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేతల ఫోరమ్ జాతీయ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారమహోత్సవం కార్యక్రమానికి టీ.జి. భరత్ గుప్త ముఖ్య అతిథి, మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగల, పసుపు బోర్డు ఎండి భవాని శ్రీ, సీఎం ఓ.ఎస్.డి వేముల శ్రీనివాసులు, జీఎస్టీ కమీషనర్ సాయి కిషోర్, బీజేపీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ కుమార్, టీపీసీసీ ప్రచార కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, టీజీవోఏ అధ్యక్షులు కృష్ణ మూర్తి, రాష్ట్ర ప్రభుత్వ ఉప కార్యదర్శి లింగ మూర్తి లు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేతల ఫోరం నూతన జాతీయ అధ్యక్షులుగా భవాని సురేష్ చారుగుండ్ల. ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ ఎర్రం,, ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్ పడకంటి, సంయుక్త కార్యదర్శిగా వంశీ నెలాంటి, కోశాధికారిగా శివ కుమార్ బొగ్గరి తో సహా 47 మంది జాతీయ కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసారు. అనంతరం టీ జి. భరత్ జ్యోతి ని వెలిగించి సభను ప్రారంభించి, ఫోరమ్ పారిశ్రామిక ప్రదర్శన లోగో మరియు బ్రోచర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరమ్ అనేది ఆర్య వైశ్య సమాజానికి చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యవస్థాపకులు, వ్యాపార నాయకులను అనుసంధానించే ఒక జాతీయ వేదికగా ఏర్పడడం గర్వకారణం అని అన్నారు. ఈ ఫోరమ్ పరిశ్రమకు ఒక బలమైన గొంతుకగా ఉంటూ, భారతదేశ ఆర్థిక పురోగతి కోసం సంస్థలను మరియు భవిష్యత్ వ్యాపార నాయకులను శక్తివంతం చేయాలని అన్నారు. అలాగే ఆర్య వైశ్య సమాజానికి దాతృత్వం మరియు సామాజిక బాధ్యత విషయంలో సుదీర్ఘమైన సంప్రదాయం ఉందని దీనిని కొనసాగించాలని కోరారు. నేను రాజకీయ నేతతోపాటు యువ పారిశ్రామికవేత్తను కూడా అని, నన్ను కూడా ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరమ్ సభ్యత్వం ఇవ్వాలని, ఫోరమ్ పటిష్ఠతకు కృషి చేస్తానన్నారు. వచ్చే సంవత్సరం ఫోరమ్ నిర్వహించే పారిశ్రామిక ప్రదర్శన కు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. ఫోరం నూతన అధ్యక్షులు భవాని సురేష్ చారుగుండ్ల మాట్లాడుతూ దేశంలోని తయారీ రంగంలో శ్రేష్ఠతను, సాంకేతిక పురోగతిని మరియు సుస్థిర వ్యాపార వృద్ధిని సాధించడానికి కట్టుబడి ఉన్న పారిశ్రామికవేత్తలు, వ్యవస్థాపకులు మరియు తదుపరి తరం నాయకులను ఒకచోట చేర్చే ఒక చైతన్యవంతమైన వేదిక అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేతల ఫోరం అని తెలిపారు. జ్ఞానం, నెట్‌వర్కింగ్, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం మరియు నాయకత్వ అభివృద్ధి ద్వారా వ్యాపారాలను బలోపేతం చేయడంపై మా దృష్టి ఉందని, అదే సమయంలో, భారత పరిశ్రమ భవిష్యత్తును తీర్చిదిద్దే తదుపరి తరం పారిశ్రామికవేత్తలను కూడా మేము ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ పూర్వ అధ్యక్షులు, వివిధ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బోగారంను కీసర డివిజన్‌లో కలపాలి మేడ్చల్ కలెక్టర్‌కు వినతి



నాగారం, జూన్ 29:-(వాయిస్ టుడే): బోగారం గ్రామాన్ని కీసర డివిజన్ లో కలపాలని సోమవారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కు బిజెపి కిసాన్ మోర్చా రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిచేలిమి కృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసారు. బోగారం గ్రామాన్ని కీసర డివిజన్ పరిధిలోకి మార్చాలని కోరుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన బిప్రజావాణిబి కార్యక్రమంలో వినతిపత్రం అందజేసినట్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామ ప్రజల పలు సమస్యల పరిష్కారానికి, పరిపాలనా సౌలభ్యం కోసం ఈ విజ్ఞప్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యల్లో నిర్లక్ష్యం...

### జోనల్ కమిషనర్‌కు అక్కల సురేష్ కుమార్ ఫిర్యాదు



నాగారం, జూన్ 29:-(వాయిస్ టుడే): ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, శివసేన తెలంగాణ మెడ్చల్ ఇన్‌చార్జ్ అక్కల సురేష్ కుమార్ ఉప్పల్ జోన్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసారు. అక్రమ నిర్మాణాలపై ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, నాగారం డివిజన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఏసీపీ రాజీవ్ రెడ్డికి పలుమార్లు ఫిర్యాదు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. మై క్యూర్ యాప్, అధికారిక గ్రీవెన్స్ పోర్టల్, ఇన్‌వార్డ్ ఫిర్యాదులు, 'ఎక్స్' ద్వారా కూడా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. అధికారుల జాప్యం వల్ల అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం, భవన నిర్మాణ నిబంధనలపై ప్రజల్లో విశ్వాసం తగ్గుతోందని ఆయన అన్నారు. సంబంధిత అధికారుల పనితీరుపై స్వతంత్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఆయన కోరారు.



## బిఎల్‌ఓలు నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించిన మేడ్చల్ డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్

కుత్బుల్లాపూర్ జూన్ 29(వాయిస్ టుడే): గాజులరామవరం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో జరుగుతున్న సర్ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని మేడ్చల్ మల్కాజ్గిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఓట్ మ్యాపింగ్ ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా భాగస్వామి కావాలని కోరారు. బిఎల్‌ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో తమ పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు, బూతు లెవెల్ అధికారులు సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించేందుకు బిఎల్‌ఓలు కృషి చేయాలని, నకిలీ ఓట్లను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు జూలై 24వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిహెచ్ బుచ్చిరెడ్డి, సంతోష్ గుప్తా, యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్, సతీష్, మధుకర్, నరేష్, మారుతి, అశోక్, రవి గుప్త, రామిరెడ్డి, దేవదాస్, ఉప్పల సంతోష్,రాజు, ఆనంద్, ఉప్పల రాములు, లక్ష్మి, రజిత, రాధిక, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# దేవేందర్ నగర్ దాడి కేసులో 13 మంది అరెస్ట్

## పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక గాలింపు – మేడిపల్లి సీఐ జలంధర్ రెడ్డి



బోడుప్పల్ జూన్ 29 : వాయిస్ టుడే న్యూస్: బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలో గృహప్రవేశ వేడుక సందర్భంగా జరిగిన దాడి ఘటనలో 13 మంది నిందితులను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు మేడిపల్లి పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, జూన్ 27 రాత్రి అనూప్ కుమార్ తన నివాసంలో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తుండగా, గతంలో జరిగిన చిన్నపాటి వివాదాన్ని మనసులో పెట్టుకున్న కొందరు వ్యక్తులు కక్షపూరితంగా దాడికి పాల్పడ్డారు. సుమారు 15 నుంచి 20 మంది వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై అక్కడికి చేరుకుని కర్రలు, హాకీ స్టిక్స్‌తో అనూప్ కుమార్, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేశారు. అనంతరం ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి ఫర్నిచర్, ఇతర గృహోపకరణాలను ధ్వంసం చేయడంతో పాటు బయట పార్క్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలను కూడా ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనను సమీపంలో నివసిస్తున్న విలేకరి విష్ణు గౌడ్ తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, ఆయనపై కూడా దాడి జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. జర్నలిస్టుపై దాడి జరగడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మీడియా విధులకు ఆటంకం కల్పించడం కూడా తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్లు 935/2026, 937/2026 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.



అరెస్టు అయిన నిందితులు: వసురి సాయి కుమార్ (33), పులి ప్రదీప్ కుమార్ (32), కేమిడి రామకృష్ణ (23), కొమ్ము వేణు (21), ఆరుట్ల సుశాంత్ రెడ్డి (25), తాటికాయల విష్ణు (23), కుంకుడుపాముల ఉదయ్ కుమార్ (22), మహమ్మద్ అక్తర్ (25), మేడికొండ సంతోష్ కుమార్ (24), కదురు సాయి తేజ (21), అకునూరి అరుణ్ (20), తొండ మహేష్ (32), వసురి యాకయ్య (60). ఈ కేసులో ఉపయోగించిన కొన్ని ద్విచక్ర వాహనాలు, దాడికి వినియోగించిన కర్రలు, హాకీ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఘటనలో గాయపడిన వారికి వైద్య చికిత్స అందించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మేడిపల్లి సీఐ డి. జలంధర్ రెడ్డి మాట్లాడుతూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. పరారీలో ఉన్న నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా ఏవైనా వివాదాలు ఉంటే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.



## కొత్త వాటర్ లైన్లు, వాటర్ జంక్షన్లు ఏర్పాటు చేయాలి

### జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్, జూన్ 29 : బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ జోనల్ కమిషనర్‌ను కలిసి బోడుప్పల్--చెంగిచెర్ల ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బోడుప్పల్, చెంగిచెర్ల రహదారి విస్తరణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే తాగునీటి సరఫరా ప్రెషర్‌ను పెంచడంతో పాటు కొత్త వాటర్ లైన్లు, కొత్త వాటర్ జంక్షన్ల ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజలకు మెరుగైన రహదారులు, నిరంతర తాగునీటి సరఫరా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బలోపేతమైన నీటి పంపిణీ వ్యవస్థ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, బొమ్మకు కళ్యాణ్ కుమార్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, బింగి జంగయ్య యాదవ్, చీరాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## బోడుప్పల్--చెంగిచెర్ల రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలి

కొత్త వాటర్ లైన్లు, వాటర్ జంక్షన్లు ఏర్పాటు చేయాలి.

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్, జూన్ 29: బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ జోనల్ కమిషనర్‌ను కలిసి బోడుప్పల్--చెంగిచెర్ల ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బోడుప్పల్, చెంగిచెర్ల రహదారి విస్తరణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే తాగునీటి సరఫరా ప్రెషర్‌ను పెంచడంతో పాటు కొత్త వాటర్ లైన్లు, కొత్త వాటర్ జంక్షన్ల ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజలకు మెరుగైన రహదారులు, నిరంతర తాగునీటి సరఫరా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బలోపేతమైన నీటి పంపిణీ వ్యవస్థ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, బొమ్మకు కళ్యాణ్ కుమార్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, బింగి జంగయ్య యాదవ్, చీరాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ఓటర్ల పేర్లు పోకుండా ఉండటానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలి

### నాగారం డివిజన్‌లో ఓటర్ లిస్టు సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

నాగారం, జూన్ 29:-(వాయిస్ టుడే): మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ ఎస్సీ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ నెం. 216లో బీఎల్ఓ సీహెచ్ అనురాధ ఆధ్వర్యంలో, బూత్ నెం. 242లో బీఎల్ఓ మహేష్ తివారి ఆధ్వర్యంలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ను పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓకు సమర్పించాలని సూచించారు. ఫారమ్‌ను సక్రమంగా సమర్పించిన వారి పేర్లు మాత్రమే తుది ఓటరు జాబితాలో కొనసాగుతాయని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను బాధ్యతగా పూర్తి చేయాలని కోరారు.

అలాగే కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఎలు) ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్లందరికీ ఎన్యూమరేషన్ ఫారమ్‌లు అందేలా చూడాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించబడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్ , మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, హరిబాబు, సుమిత్ర, సురేష్, మాజీ ఎంపీటీసీలు పంగ ముత్యాలు, ప్రవీణ్, ముద్రగానం మహేంద్ర యాదవ్, మాజీ ఉపసర్పంచ్ మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సతీష్ గౌడ్, దాసోహం నర్సింహరావు, రాల కృష్ణయ్య యాదవ్, రాల సన్నీ యాదవ్, పంగ శ్రీహర, పంగ సంతోష్, ప్రసాద్ పంతులు , దాసర్ రామ్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, బొల్లబోయిన సత్యనారాయణ యాదవ్, పరమేష్, భూములి యాదవ్, ఓం ప్రకాష్ గౌడ్, యువ నాయకులు జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం పటేల్ జిల్లా ముఖ్య సమావేశం

## జిల్లా నూతన కమిటీ నియామకం

## – జనగణనలో "పటేల్" నమోదు చేసుకోవాలని పిలుపు

ఆసిఫాబాద్ (వాయిస్ టుడే న్యూస్) : తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా ముఖ్య సమావేశం గోలేటి పట్టణంలోని సింగరేణి క్లబ్ ఏసీ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగాం రాజారాం పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చెన్న సోమశేఖర్ పటేల్, ఆకుల సత్తన్న పటేల్, రాష్ట్ర కార్యదర్శి అన్నం రమేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ, కుల గుర్తింపు విషయంలో సరైన నమోదు జరగకపోవడం వల్ల అసలు సంఖ్య తగ్గి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే జనగణనలో మున్నూరు కాపు పటేల్ కుటుంబాలు తమ పేర్ల చివర "పటేల్" అని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కొంతమంది "రెడ్డి" పేరుతో నమోదు కావడం వల్ల మున్నూరు కాపుల అసలు జనాభా లెక్కల్లో ప్రతిబింబించడం లేదని పేర్కొన్నారు.

మున్నూరు కాపుల ఐక్యత, సామాజిక గుర్తింపు, రాజకీయ ప్రాధాన్యత పెంపు లక్ష్యంగా తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ సంస్థ 2018లో స్థాపించబడిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష మంది సభ్యులతో బ్యాలెట్ పద్ధతిలో రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించి సంఘం బలాన్ని చాటాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా గజ్జల లక్ష్మణ్ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిశెట్టి సదాశివు పటేల్, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కుందారపు శంకరమ్మ పటేల్‌ను నియమించారు. అదనంగా మరో 20 మంది సభ్యులకు జిల్లా కమిటీలో అవకాశం కల్పించారు. రాష్ట్ర స్థాయి ఎన్నికల నిర్వహణ కోసం గ్రామ స్థాయి సంఘాలను బలోపేతం చేసి సభ్యుల వివరాలను సేకరించాలని నాయకులు సూచించారు. ఇందుకు సంబంధించిన డేటా సేకరణ పత్రాలను జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ పటేల్‌కు అందజేశారు. సంఘం బలోపేతానికి యువత, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో మున్నూరు కాపుల ప్రాతినిధ్యం పెంచేందుకు సంఘం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమం చివరలో నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేసి, సమావేశంలో పాల్గొన్న కుల బాంధవ్యులందరికీ కొండ దేవయ్య పటేల్ ధన్యవాదాలు తెలిపారు.





# ఛలో వరంగల్‌కు తరలిన బీజేపీ శ్రేణులు



తొర్రూరు, జూన్ 29 వాయిస్ టుడే : బీజేపీ జాతీయ అధ్యక్షులు నితీన్ నభీన్ ఉమ్మడి వరంగల్ జిల్లా లో పర్యటిస్తున్న సందర్భంగా సోమవారం హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో 'బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం 'ఏర్పాటు చేయడం జరిగింది.ఈసమ్మేళనానికి బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ , తొర్రూరు రూరల్ మండలం అధ్యక్షులు గట్టు రాంబాబు ఆద్వర్యంలో రెండు మండలాల నుంచి పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణులు తరలి వెళ్ళడం జరిగింది.తొర్రూరు లో స్థానిక గెస్ట్ హౌస్ సెంటర్ వద్ద బీజేపి జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ లో బీజేపీ జెండా రెపరెపలాడడం కోసం తెలంగాణ లో మూడు రోజులు బీజేపీ జాతీయ అధ్యక్షులు నితీన్ నభీన్ పర్యటిస్తున్నారని ,దీనిలో భాగంగానే ఉమ్మడి వరంగల్ జిల్లా బూత్ అధ్యక్షుల సమ్మేళనం లో పాల్గొంటున్నారు అని తెలిపారు.బూత్ స్థాయిలో బీజేపీ పార్టీని పటిష్టం చేసి రాబోయే ఎన్నికలకు సంసిద్ధం చేయడం కోసం బీజేపీ జాతీయ నాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు.రాబోయే వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించడం కోసం ఈరోజు జాతీయ అధ్యక్షులు నితీన్ నభీన్ పర్యటన ఎంతో దోహదపడుతుందని తెలిపారు.వరంగల్ లో మెగా టెక్స్ టైల్ పార్క్,మామునూరు లో విమానాశ్రయం ఏర్పాటు, అమృత్ సిటి, స్మార్ట్ సిటీ పథకంలో వరంగల్ కోట్లాది రూపాయల నిధులు,సమ్మక్క సారలమ్మ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు వంటి వాటిని మంజూరీ చేసి కోట్లాది రూపాయలు అందించిన నరేంద్ర మోడీ నాయకత్వం పట్ల ప్రజల్లో రోజురోజుకూ విశ్వాసం,నమ్మకం పెరిగింది అని తెలిపారు.ఖచ్చితంగా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు.ఈకార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలుపుల శంకర్, జిల్లా నాయకులు అమ్మాపురం గ్రామ ఉప సర్పంచ్ సిరిపాటి విశాల్, మండల ప్రధాన కార్యదర్శులు నడిగడ్డ సందీప్, గుగులోత్ భాస్కర్ నాయక్, జిల్లా, మండల నాయకులు మంగళపల్లి యాకయ్య,చలువాది సత్యనారాయణ,కాగు నవీన్,సిహెచ్.విజయ్ కుమార్, గుండా సురేష్,నూకల నవీన్,బండి శ్రీనివాస్,తాడిశెట్టి నవీన్, శోభా రాణి, సతీష్, కిన్నెర శ్రీనివాస్, శ్రీనివాస్ చారి,సర్వి వెంకటేష్, ధరావత్ తేజస్, సంతోష్, కొండపల్లి శ్రీనువాస్, తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా ఉత్తమ క్లబ్‌గా తొర్రూరు లయన్స్ సేవాతరుణి

## ఏడాదిలో విస్తృతంగా 2115 సేవా కార్యక్రమాలు

తొర్రూరు, జూన్ 29 వాయిస్ టుడే : ఏడాది కాలంలో విస్తృతంగా 2115 సేవా కార్యక్రమాల్ని నిర్వహించి జిల్లాలోని ఉత్తమ క్లబ్ గా తొర్రూరు లయన్స్ సేవా తరుణి నిలిచింది.సేవా తరుణి అధ్యక్షురాలు తుమ్మూరు శ్రీదేవి రెడ్డి నాయకత్వంలో క్లబ్ ఆధ్వర్యంలో అభాగ్యులు,పేద విద్యార్థులు, చిరు వ్యాపారులు, సబ్బండ వర్గాల ప్రజలకు సేవలు అందాయి.దాన్ని గుర్తించిన లయన్స్ పెద్దలు తొర్రూరు సేవా తరుణి క్లబ్ జిల్లా ఉత్తమ క్లబ్ గా ఎంపిక చేసి అవార్డు అందజేసింది.నాయకత్వ పటిమ చూపిన అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి ఇయర్ ఆఫ్ ద డిస్ట్రిక్ట్ ఔట్ స్టాండింగ్ ప్రెసిడెంట్ అవార్డును అందుకున్నారు.తాజాగా వరంగల్ హంటర్ రోడ్డులోని గోల్డెన్ గార్డెన్ లో 2025--26 సంవత్సర జిల్లా పురస్కారాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.జిల్లా గవర్నర్ చంద్రశేఖర ఆర్య చేతుల మీదుగా శ్రీదేవి రెడ్డి ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు.వీరితోపాటు డిస్టిక్ బెస్ట్ సెక్రెటరీగా కూన పద్మావతి,ట్రెజరర్ గా మంజుల, జి ఎల్ టి కోఆర్డినేటర్ అవార్డు శారద, క్లబ్ ఎక్స్టెన్షన్ చైర్ పర్సన్ అవార్డు, కమిటెడ్ లయన్, క్యాబినెట్ మెంబర్ లయన్ నాగవాణికి, బెస్ట్ జోన్ చైర్ పర్సన్ అవార్డు వజినపల్లి దీప, బెస్ట్ క్యాబినెట్ అవార్డు వజినపల్లి శైలజ, బెస్ట్ కమిటెడ్ లయన్ అవార్డు లయన్ ఉమా రెడ్డి, పీస్ పోస్టర్ అవార్డులు రెండు, బెస్ట్ హంగర్ రిలీఫ్ అవార్డు లు వరించాయి.తొర్రూరు సేవా తరుణితో పాటు పలువురు లయన్ లకు విశిష్ట పురస్కారాలు తగ్గడంతో స్థానికంగా హర్షాతిరేఖాలు వ్యక్తం అయ్యాయి. ఈ సందర్భంగా శ్రీదేవి రెడ్డి మాట్లాడుతూ సంవత్సరకాలంలో చేసిన సేవా కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయని,తొర్రూరు సేవా తరుణి సేవలు గుర్తించిన లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు బెస్ట్ డిస్ట్రిక్ క్లబ్ అవార్డు అందించడం గర్వకారణంగా ఉందన్నారు. నూతన ప్రతినిధులకు స్ఫూర్తిగా తొర్రూరు క్లబ్ నిలవడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని సేవాతరుని క్లబ్ ద్వారా నిరూపితమైందన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



తొర్రూరు, జూన్ 29 వాయిస్ టుడే : తొర్రూరు పట్టణంలోని హరిపిరాల రోడ్డు కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం శారదాదేవి కోరారు.పాఠశాలలో ఉన్న సమస్యలపై సోమవారం తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల లోపల బయట ఆవరణలో చెత్తను తొలగించి చెత్త కుండిని ఏర్పాటు చేయాలని,వర్షానికి కూలిపోయిన ప్రహరీ గోడ నిర్మించాలని,వంట గదికి మరమ్మత్తు పనులు చేయించాలని, మిషన్ భగీరథ నల్ల ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలకు రంగులు వేయించి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రమాదేవి, ఉపాధ్యాయులు విమలాదేవి, దర్గా హుస్సేన్ పాల్గొన్నారు.



# ఏర్పుగొండ ముత్తయ్యకు నివాళులర్పించిన డాక్టర్ మంగళపెల్లి హుస్సేన్

తొర్రూరు, జూన్ 29 వాయిస్ టుడే : తొర్రూరు మండలంచీకటియపాలెం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ ఉపేందర్ తండ్రిగారైన ఏర్పు గొండ ముత్తయ్య జూన్ 24 వ తారీకు నాడు అనారోగ్య కారణంగా మరణించడం జరిగింది. ఈరోజు వారి నివాస గృహంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రామరాజు. చారి. పాలకుర్తి నియోజకవర్గం కమిటీ సభ్యులు గిద్దె లక్ష్మణ్ వారి తల్లిగారైన ఉప్పలమ్మ. అన్నగారు యాకయ్య. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధన అందించాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

**న్యూశాయంపేట అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**

**బోధన విధానం,అభ్యసన సామర్థ్యం,పోషకాహారంపై సమగ్ర పరిశీలన**

హనుమకొండ, వాయిస్ టుడే: అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సులభంగా అర్థమయ్యే విధంగా చార్టులు, బొమ్మలు,ఆట వస్తువులు (ప్లే ఎక్విప్‌మెంట్) వినియోగిస్తూ నాణ్యమైన బోధన అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. సోమవారం హనుమకొండ న్యూశాయంపేట పోచంపల్లి ప్రభుత్వ పాఠశాలలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారుల హాజరు వివరాలను అంగన్వాడీ టీచర్ రమను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులతో నేరుగా మమేకమైన కలెక్టర్ వారికి సులభమైన ప్రశ్నలు అడిగి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుడి పాత్రలో బోర్డుపై ఆంగ్ల అక్షరాలు రాసి వాటిని గుర్తించగలరా అని అడిగి చిన్నారుల పఠన నైపుణ్యాన్ని పరీక్షించారు. బోధనలో ఉపయోగిస్తున్న చార్టులు,విద్యా సామగ్రి,అభ్యాస పట్టికలను పరిశీలించిన కలెక్టర్ వాటి వినియోగంపై అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే చిన్నారులకు అందిస్తున్న పోషకాహార భోజనాన్ని తనిఖీ చేసి నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల్లో ఆసక్తి పెంపొందించేలా ఆటల ద్వారా బోధన (ప్లే-బేస్డ్ లెర్నింగ్) విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అంగన్వాడీ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి చిన్నారి ఆనందంగా నేర్చుకునే వాతావరణాన్ని కల్పించడంతో పాటు వారి మానసిక,శారీరక వికాసానికి అనుగుణంగా బోధన సాగాలని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు

## ఇంటింటికీ తిరుగుతూ ఫారాలు అందిస్తూ ఓటర్లకు అవగాహన



కాజీపేట,వాయిస్ టుడే: వర్ధన్నపేట నియోజకవర్గంలోని 46వ డివిజన్ మడికొండలో ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియపై ప్రతి ఓటరికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు సోమవారం పాల్గొన్నారు. బీఎల్‌వోలు వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎన్యూమరేషన్ పత్రాలను ఓటర్లకు పంపిణీ చేసి వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ఫారాలు అందిస్తూ ఓటర్లకు అవగాహన కల్పించారు.ప్రతి ఇంటికి,ప్రతి ఓటరుకు ఈ ప్రక్రియ గురించి వివరించి అవగాహన కల్పించేందుకు తను పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు వస్కుల నాగరాజు,మెట్టుగుట్ట దేవస్థానం చైర్మెన్ పైడిపాల రఘుచందర్,పట్టణ ఉపాధ్యక్షులు వస్కుల శ్రీనివాస్,64వ డివిజన్ సీనియర్ నాయకులు బైరి లింగమూర్తి,శివ నాగరాజు, ఉదయ్,పల్లెపు అర్జున్, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
VOICE OF PRAJALU
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
మంగళవారం 30 జూన్ 2026




# అర్హులైన నిరుపేద లబ్ధిదారులందరికీ తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ కేటాయించాలి!

**అధికార పార్టీ నేతల అనుచరులకేనా ఇండ్లు?**
**అనర్హుల కేటాయింపులపై ఉన్నత స్థాయి విచారణ జరపాలి**

**ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ హెచ్చరిక**



కరీంనగర్,జూన్ 29(వాయిస్ టుడే): అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్,ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు.అనంతరం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలో గత 20 సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక,కిరాయి ఇండ్లలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్న పేదలు ఎందరో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే భర్తను కోల్పోయి, పిల్లలను సాకుతూ అత్యంత దీన స్థితిలో బతుకులీడుస్తున్న వితంతువులకు ప్రాధాన్యతఇవ్వాలని డిమాండ్ చేశారు.అనర్హుల కేటాయింపులపై సమగ్ర విచారణ జరపాలి.ఇటీవల కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయని బండారి శేఖర్ ఆరోపించారు.దాదాపు 100 మందికి పైగా అనర్హులకు,ముఖ్యంగా అధికార పార్టీ నాయకుల అనుచరులకు ఎలాంటి అర్హత లేకపోయినా ఇండ్లను కేటాయించారని మండిపడ్డారు. రాజకీయ సిఫార్సులతో జరిగిన ఈ కేటాయింపులపై తక్షణమే ఉన్నత స్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపించి,వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇండ్లు ఇస్తుందా? లేక లబ్ధిదారులను తీసుకొని మేమే ఇండ్లను ఆక్రమించాలా? అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.జిల్లా కలెక్టర్ ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, అనర్హుల జాబితాను తొలగించి, నిజమైన నిరుపేదలకు న్యాయం చేయాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేదల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బద్రి నేతతో లబ్ధిదారులు పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్,జూన్ 29(వాయిస్ టుడే): లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ 2026--27 లయనిస్టిక్ సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది.ఈ సందర్భంగా లయన్ మ్యాడం శివకాంత్ పటేల్ అధ్యక్షుడిగా,లయన్ బట్టు వినోద్ కార్యదర్శిగా,లయన్ మెతుకు చైతన్య ఖజాంచిగా,లయన్ ఐత సూరజ్ సంయుక్త కార్యదర్శిగా,లయన్ కంభం ప్రసాద్ సంయుక్త ఖజాంచిగా,లయన్ ముక్క శరత్ కృష్ణ తక్షణ మాజీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు లయన్ మ్యాడం శివకాంత్ పటేల్ మాట్లాడుతూ సభ్యులు తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేసి,వి సర్వ్ అనే లయన్స్ ఇంటర్నేషనల్ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్తూ సమాజ సేవలో మరింత ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సభ్యులు, ఆహ్వానితులు,దాతలు, శ్రేయోభిలాషులందరికీ నూతన కార్యవర్గం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.



## శిశు మందిర్‌లో ఘనంగా జ్యేష్ఠ పౌర్ణమి, ఏరువాక పూర్ణిమ యజ్ఞం

కరీంనగర్,జూన్ 29(వాయిస్ టుడే):స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో జ్యేష్ఠ పౌర్ణమి మరియు ఏరువాక పూర్ణిమ సందర్భంగా పౌర్ణమి యజ్ఞం ఘనంగా నిర్వహించారు.పాఠశాల కార్యదర్శి కోల అన్నా రెడ్డి,ఎలగందుల శ్రీనివాస్,పుల్లెల శ్యామ్,సిఎచ్ సత్యనారయణ,కొంజర్ల మహేష్ యజ్ఞంలో పాల్గొనగా జ్యోషం అభిలాష్ యజ్ఞం గావించారు.కోల అన్నారెడ్డి మాట్లాడుతూ ఏరువాక పూర్ణిమ రైతుల పండుగ అని రైతులకు పంటలు సుభిక్షంగా పండాలని కోరుకుంటున్నామని ఈ సంధర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బల్మూరి కరుణాకర్ రావు,గట్టు శ్రీనివాస్,కొత్తూరి ముకుందశీ,గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు,అప్పిడి వకుళ దేవి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు,చందా సుధాకర్,కునడి రామ్ రెడ్డి,ఎం.భాస్కర్ రెడ్డి,రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు,తణుకు మహేష్ పాల్గొన్నారు.

# గుడిసెలు లేని నియోజకవర్గమే లక్ష్యం

**అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు**

**గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయల పనులు**

**గత ఎమ్మెల్యేగా చిల్లర పనులతో నియోజకవర్గ పరువు తీశారు**

**స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**ధర్మసాగర్‌లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి**



హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని తెలంగాణలోనే గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. పూర్తిగా ఇల్లులేని నిరుపేదలకు రాజకీయాలకు అతీతంగా మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. సోమవారం ధర్మసాగర్ మండలంలోని ఎల్కుర్తి,జానకిపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపన కార్యక్రమాలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదని విమర్శించారు. ఎల్కుర్తి గ్రామానికి నాలుగు వైపులా ఉన్న బీటీ రోడ్లు తాను ఎమ్మెల్యేగా,మంత్రిగా ఉన్న సమయంలోనే నిర్మించామని,అప్పట్లో వేసిన సింగిల్ రోడ్లను ఇప్పుడు డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జాతీయ రహదారి నుంచి ఎల్కుర్తి మీదుగా నారాయణగిరి వరకు రూ.18 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరైందని,కరుణాపురం నుంచి సోమదేవరపల్లి మీదుగా ఎల్కతుర్తి వరకు రూ.50 కోట్లతో మరో డబుల్ రోడ్డు త్వరలో మంజూరు కానుందని వెల్లడించారు. ఎల్కుర్తి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు,సైడ్ డ్రైనేజీ పనులను 60 రోజుల్లో పూర్తి చేస్తామని,గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఎల్కుర్తి గ్రామంపై తనకు ప్రత్యేక అభిమానం ఉందని పేర్కొన్న ఆయన అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఏడాదిలోపు గ్రామానికి నాలుగు వైపులా ఉన్న బీటీ రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చి గ్రామ రూపురేఖలను పూర్తిగా మార్చేస్తామని తెలిపారు. జానకిపురం గ్రామాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ నారాయణగిరి నుంచి జానకిపురం మీదుగా రాయగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి త్వరలోనే మంజూరు చేయిస్తామని చెప్పారు. గ్రామ పంచాయతీ భవనానికి నెల రోజుల్లో నిధులు మంజూరు చేస్తామని,ఇప్పటికే రూ.45 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించగా, త్వరలో మరో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనం మంజూరు చేస్తామని తెలిపారు.

**చిల్లర పనులతో నియోజకవర్గ పరువు తీశారు..**

గతంలో 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న నాయకులు అభివృద్ధిని పట్టించుకోకుండా పనులు,పథకాలు,పదవులు అమ్ముకోవడానికే కాకుండా చిల్లర పనులతో నియోజకవర్గ పరువు తీసారని కడియం ఆరోపించారు. ఏనాడూ ఒక్క పని చేయని వారు ఇప్పుడు విమర్శలు చేస్తున్నారని,గత ఎమ్మెల్యే ఏమి చేశాడు.. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే ఏమి చేస్తున్నాడో ప్రజలు ఆలోచించాలని కోరారు. పని చేసే వారిని,పని చేయని వారిని ఒకేలా చూడవద్దని సూచించారు. నియోజకవర్గాన్ని,గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు.

**కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణి..**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ పథకాల అమలు జరగాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ మండలానికి సంబందించిన 26మంది కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ లబ్ధిదారులకు 26లక్షల 03వేల 016రూపాయల విలువగల చెక్కులను,అలాగే 39మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 14లక్షల 25వేల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన భూక్య వసంత అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం 2లక్షల 50వేల రూపాయల ఎల్ఓసి ని మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే ముప్పారం గ్రామంలో రెండు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి మంజూరు పత్రాన్ని స్థానిక సర్పంచ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్ బావుసింగ్, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు,మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



## విద్యాశాఖ నిర్లక్ష్యంపై కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన

కరీంనగర్, జూన్ 29(వాయిస్ టుడే): జిల్లాలోని విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంపై బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కళ్ళకు గంతలు,ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు దొగ్గలి శ్రీధర్, మాదాసు సంజీవ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక దోపిడీ చేస్తున్న సంబంధిత విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరుతున్నట్టు వ్యవహరిస్తున్నారని దీనిపై విద్యాశాఖ అధికారులకు పాలుసార్లు వివిధ సంఘాలు ఫిర్యాదు చేసినప్పటికీ విద్యాశాఖ అధికారుల తీరు మారలేదని అని మండిపడ్డారు. అదేవిధంగా విద్యాశాఖ అధికారులు విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని పరోక్షంగా సహకరించే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించాలని పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్యను అమలు చేయాలని అదేవిధంగా,ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని,ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని,విద్యాసంస్థల ఎదుట ఫీజుల వివరాలు తెలిపే పట్టికను ఏర్పాటు చేయాలని, ప్రైవేటు విద్యాసంస్థల దోపిడి అరికట్టాలని డిఎఫ్ఆర్సి మాత్రమే అనుమతించిన ఫీజులు వసూలు చేయాలని తోక పేర్లతో ఐఐటి,నీట్, ఒలంపియాడ్,ఇంటర్నేషనల్ వంటి తోక పేర్లతో నడుస్తున్న విద్యాసంస్థలపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని శ్రీధర్ అన్నారు.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు జులై 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్ కు సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు వాయిల రాజ్ కుమార్, దుప్పటపల్లి మురళి,విద్యార్థి సంఘం నాయకులు కుసుంబ ఆదర్శ్,రవీంద్ర చారి,కట్ట సంజీవ్ పాల్గొన్నారు.



## 35వ డివిజన్ కాపువాడలో రూ.52 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరీంనగర్,జూన్ 29(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ పరిధిలోని 35వ డివిజన్ కాపువాడలోని వెంకటసాయి టాకీస్ వెనుక రోడ్డులో మౌలిక వసతుల కల్పనలో భాగంగా నూతన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.రూ.52 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో మంజూరైన పైప్ డ్రైన్ మరియు సి.సి.రోడ్ నిర్మాణ పనులకు భూమి పూజ (శంకుస్థాపన) కార్యక్రమం నిర్వహించారు. ఈ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్,మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు,మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ సాదవేని సుజాత శ్రీనివాస్,బీజేపీ నాయకులు, మున్సిపల్ అధికారులు,కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## బీజేపీ మంత్రిని రాజీనామా చేయమంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి కోపమా?

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి**

**జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్**



కరీంనగర్, జూన్ 29(వాయిస్ టుడే): నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ,ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన లోక్ భవన్ ముట్టడి పిలుపు సందర్భంగా కరీంనగర్ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాశ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం నిర్వహించే కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చే ప్రభుత్వం, ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు నిర్వహించే నిరసనలకు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్య అని విమర్శించారు.దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు వైద్య విద్యలో ప్రవేశం కోసం నీట్ పరీక్ష రాశారని, రాజస్థాన్‌లో జరిగిన పేపర్ లీకేజీ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఎంతో కష్టపడి చదివి మంచి ర్యాంక్ సాధించి వైద్య విద్య అభ్యసించాలని కలలు కన్న విద్యార్థుల ఆశలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా స్పందించకపోవడం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకుండా పరీక్షను మళ్లీ నిర్వహిస్తామని ప్రకటించడం విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందన్నారు.గతంలో కూడా పేపర్ లీకేజీల కారణంగా విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు రాజకీయ, పరిపాలనా బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు.ఈ డిమాండ్‌తో శాంతియుత నిరసన చేపట్టాలనుకున్న విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరైన చర్య కాదని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని,నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని బాధ్యత వహించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ మరోసారి డిమాండ్ చేసింది.

## ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్**



కరీంనగర్, జూన్ 29(వాయిస్ టుడే): నగరంలోని కార్ఖానా గడ్డ సర్వే నెంబర్ 53లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని,కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణుప్రసాద్ జిల్లా కలెక్టర్‌కు ప్రజా వాణి లో ఫిర్యాదు చేశారు.సర్వే నెంబర్ 53లో ఉన్న ప్రభుత్వ భూమికి సంబంధించి ఫోర్జరీ ప్రోసీడింగ్ నెంబర్ బి1 /635/06 ద్వారా 11,14 గుంటల భూమినీ,కల్లేపల్లి బలరాజు అనే వ్యక్తి ఆక్రమించుకున్నారని ఆరోపించారు.అక్రమంగా ఆక్రమించిన ఈ స్థలాన్ని,డాక్యుమెంట్ నెంబర్ 5036/2021 ద్వారా కల్లేపల్లి కనకమ్మ నుంచి తనకు గిఫ్ట్ డీడ్ (బహుమతి) కింద వచ్చినట్లుగా సృష్టించి,బలరాజు తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కార్పొరేటర్ వివరించారు. అంతేకాకుండా ఆ స్థలం నుంచి సుమారు 779 గజాల స్థలాన్ని అక్రమంగా విక్రయించారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ప్రభుత్వ ఆస్తులను అక్రమార్కుల నుంచి కాపాడాలని,ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ లావాదేవీలకు పాల్పడిన కల్లేపల్లి బలరాజుపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకొని,ప్రభుత్వ భూమిని రక్షించాలని కార్పొరేటర్ సోమిడి వేణుప్రసాద్ జిల్లా యంత్రాంగాన్ని కోరారు.

# విద్యార్థి గా మారి.. పాఠాలు విని విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్





## ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఈఎంఆర్ఎస్ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ తనిఖీ

రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ 29(వాయిస్ టుడే):నిత్యం విధి నిర్వహణలో బిజీ బిజీగా ఉండే జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ విద్యార్థులకు బోధన చేస్తున్న తీరును వారితో కలిసి కూర్చుని పరిశీలిస్తూ.. పాఠ్యాంశం విన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యాలయంలో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎకనామిక్స్ పాఠ్యాంశం ఉపాధ్యాయుడు బోధిస్తుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో కలిసి బెంచి పై కూర్చున్నారు. పాఠ్యాంశం బోధనను స్వయంగాప రిశీలించారు. పూర్తి అయిన తర్వాత దానిపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం డైనింగ్ హాల్ కు వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా.. ముందుగా మెనూ పరిశీలించి.. సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం ప్రతి రోజు భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదవాలని, ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి. చదువులో రాణించి.. తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. లైబ్రరీ లో పుస్తకాలతోపాటు దిన పత్రికలు చదవాలని తెలిపారు. దీంతో అన్ని విషయాలపై అవగాహన వస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు. పరిశీలనలో ప్రిన్సిపాల్ ఫాతిమా, ఎంపీడీఓ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## చేనేత సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తా : వొడితల ప్రణవ్


హుజురాబాద్ జూన్ 29 (వాయిస్ టుడే): రాంపూర్-రంగాపూర్ లోగల బాపూజీ చేనేత సహకార సంఘాన్ని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా పాలకవర్గం ఏర్పాటుకాగా కొత్తగా ఎన్నికైన వారిని శాలువాతో ప్రణవ్ సత్కరించారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ చేనేత సహకార సంఘాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముషం వెంకట నారాయణ,ఉపాధ్యక్షుడు జడల వెంకటేశ్వర్లు,కోశాధికారి ముషం రవి, సభ్యులుగా వెంకటేశ్వర్లు,ప్రభులింగం,సదానందం,శాంతయ్య,బండారి శోభా-సదానందం, పద్మ, జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం,జిల్లా అధికార ప్రతినిధి నేరేళ్ల మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబయ్య,యూత్ కాంగ్రెస్ సజ్జు,గ్రామ శాఖల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, రామచంద్రం,నరసింహ రెడ్డి,ఓదెలు తదితరులు పాల్గొన్నారు.



## భువనగిరి సమరభేరికి మంత్రి పొన్నంను ఆహ్వానించిన టీఆర్పీ నాయకులు

**ఉచితాలు కాదు,రాజ్యాధికార సాధనే మా లక్ష్యం**

**టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా**



కరీంనగర్, జూన్ 29(వాయిస్ టుడే): భువనగిరి సమరభేరిలో పాల్గొనాలని కోరుతూ పొన్నం ప్రభాకర్ ను టీఆర్పీ నాయకులు కోరారు.కరీంనగర్ మాజీ ఎంపీ,హుస్నాబాద్ ఎమ్మెల్యే,బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ ను చుగురుమామిడి మండలం కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ లిరాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా,పార్టీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి,తీన్మార్ మల్లన్న నాయకత్వంలో జులై 05న భువనగిరిలో నిర్వహించబడే రాజ్యాధికార సమరభేరి మహాసభకు హాజరుకావాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ మరియు బహుజన వర్గాలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ అధికారం,సామాజిక న్యాయం,సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉద్యమిస్తోందని తెలిపారు.బీసీల అభివృద్ధి కేవలం సంక్షేమ పథకాలతో కాకుండా, రాజకీయ రాజ్యాధికారం ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అందుకే భువనగిరిలో నిర్వహించనున్న సమరభేరి సభ బహుజన వర్గాల రాజకీయ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక సభగా నిలవనుందని అన్నారు.బీసీలు అంటే ఉచితాలకు వర్తించే వారు కాదని,బీసీలకు వాటా, ఆత్మగౌరవం,అధికారం దక్కేదాక పోరాటం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్,జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి ఇశ్రత్ శావాలి, మండల అధ్యక్షులు బుర్ర అశోక్, శివరాత్రి మోహన్,నాయకులు కోరె గంగా,ఉప్పులేటి రాణి పాల్గొన్నారు.

# 24 గంటల లోపు హత్య కేసు ఛేదించిన పోలీసులు

**- హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్, రక్తపు మరకలున్న దుస్తులు, సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్ స్వాధీనం**



జమ్మికుంట జూన్ 29 (వాయిస్ టుడే): ఆదివారం రాత్రి సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు మడిపెల్లి గ్రామానికి చెందిన గంగారపు మహేష్ (40)ను అతని నివాసంలో అదుపులోకి తీసుకొని విచారించగా, హత్య చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

విచారణలో నిందితుడు వెల్లడించిన వివరాల ప్రకారం.. తన వ్యవసాయ భూమి సమీపంలో కౌలుకు వ్యవసాయం చేస్తున్న ఓ వివాహిత మహిళతో తనకు సన్నిహిత పరిచయం ఏర్పడిందని తెలిపాడు. ఇదే సమయంలో మృతుడు పైతరి మొగిలి ఆ మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడటంతో తానే ఆమెకు అండగా నిలిచి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించినట్లు పేర్కొన్నాడు. ఆ కేసులో జైలుకు వెళ్లి విడుదలైన తర్వాత మృతుడు తనను తరచూ అవమానిస్తూ, దూషిస్తూ, రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించేవాడని తెలిపాడు. ఈ ఘటనల కారణంగా రెండు కుటుంబాల్లో తీవ్ర విభేదాలు తలెత్తాయని, అందుకు మృతుడే కారణమని భావించి కక్ష పెంచుకుని హత్యకు పథకం రచించినట్లు ఒప్పుకున్నాడు.ఈ నెల 27న పీర్ల పండుగ సందర్భంగా మడిపెల్లి గ్రామానికి వచ్చిన మృతుడిని గమనించిన నిందితుడు, ముందస్తుగా యూట్యూబ్‌లో హత్యలకు సంబంధించిన వీడియోలు, ఆయుధాల తయారీ విధానాలపై శోధించినట్లు వెల్లడించాడు. అనంతరం ఇంటి నుంచి ఇనుప రాడ్ తీసుకుని, తన వ్యవసాయ భూమి సమీపంలోని అంకుశాపూర్ వెళ్లే దారిలో మద్యం సేవిస్తూ మృతుడి కోసం వేచి ఉన్నట్లు తెలిపాడు.

అదే రోజు రాత్రి సుమారు 11.45 గంటలకు మడిపెల్లి గ్రామ శివారులో అంకుశాపూర్ రోడ్డుపై సైకిల్‌పై వెళ్తున్న మృతుడిపై వెనుక నుంచి ఇనుప రాడ్‌తో తల వెనుక భాగంలో బలంగా దాడి చేశాడు. మృతుడు కిందపడిపోయిన అనంతరం తల, ముఖంపై విచక్షణారహితంగా పలుమార్లు దాడి చేసి మృతి చెందినట్లు నిర్ధారించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు వివరించాడు. అనంతరం హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను తన వ్యవసాయ బావి సమీపంలో పడేసి, ఇంటికి వెళ్లి రక్తపు మరకలున్న దుస్తులు మార్చుకున్నట్లు తెలిపాడు. నిందితుడి చూపిన ఆధారాల మేరకు పోలీసులు హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్, రక్తపు మరకలున్న లుంగీ, నలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ టీ-షర్ట్, హత్యకు ముందు యూట్యూబ్‌లో శోధనలు చేసిన మోటరోలా ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌తో పాటు ఘటనలో ఉపయోగించిన హీరో ప్యాషన్ ప్రో మోటార్‌సైకిల్ (నంబర్: TS-02-FG-3054) ను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడిస్తూ, నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.



## కలెక్టరేట్ హెలిప్యాడ్ గ్రౌండ్ పార్కు అభివృద్ధి చేయండి

**డిప్యూటీ మేయర్ సునీల్ రావు**

కరీంనగర్, జూన్ 29(వాయిస్ టుడే): పట్టణంలోని కలెక్టరేట్ ఆవరణలో గల హెలిప్యాడ్ గ్రౌండ్ పార్కును అభివృద్ధి చేపట్టాలని కోరుతూ డిప్యూటీ మేయర్ సునీల్ రావు కలెక్టర్ చిత్ర మిశ్రాకు వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం నడిబొడ్డులో ఉండి నగర వాసులకు ఆహ్లాదకంగా ఉండే పార్కును అభివృద్ధి చేస్తే ప్రజలు ఉల్లాస భరితంగా సేద తీరే సౌకర్యం కలుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ ను కోరారు.



## బీడీ కార్మికులకు రూ.4,016 ఆసరా పింఛన్, రూ.6,000 పీఎఫ్ పెన్షన్ అమలు చేయాలి

**సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట బీడీ వర్కర్స్ యూనియన్ ధర్నా.**

రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ 29 (వాయిస్ టుడే): బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.4,016 ఆసరా పింఛన్‌ను, కేంద్ర ప్రభుత్వం కనీస పీఎఫ్ పెన్షన్‌ను రూ.6,000కు పెంచి అమలు చేయాలని బీడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ముశం రమేష్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీడీ కార్మికులందరికీ రూ.4,016 పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. ఉత్తర తెలంగాణలో ప్రతి ఇంట్లో బీడీ కార్మికులు ఉన్నారని, వారి ఓట్లతోనే రాజకీయ పార్టీలు గెలుస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా పీఎఫ్ పెన్షన్ పెంపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం చాలామంది కార్మికులకు వెయ్యి రూపాయల లోపే పీఎఫ్ పెన్షన్ వస్తోందని, కనీస పింఛన్‌ను రూ.6,000కు పెంచాలని కార్మిక సంఘాలు ఎన్నో సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు. బీడీ కార్మికుల ఓట్లతో గెలిచిన కేంద్ర మంత్రి బండి సంజయ్ పార్లమెంటులో బీడీ కార్మికుల పీఎఫ్ పెన్షన్ పెంపుపై మాట్లాడాలని, ప్రతిపక్ష నాయకుడు కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై అసెంబ్లీలో గళమెత్తాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు జీవన భృతి రూ.4,016, పీఎఫ్ పెన్షన్ రూ.6,000 అమలు చేయకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి సురం పద్మ, ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, జవ్వాజి విమల, అన్నల్ దాస్ గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందు లక్ష్మణ్, జిందం కమలాకర్, దాసరి రూప, గుంటి అనిల్, బెజిగం సురేష్, ఆడెపు రజిత, పిల్లి జాను, సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు.



## గ్రీవెన్స్ డేలో 26 ఫిర్యాదుల స్వీకరణ

**అదనపు ఎస్పీ చంద్రయ్య.**

రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ 29 (వాయిస్ టుడే): జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి 26 ఫిర్యాదులను అదనపు ఎస్పీ చంద్రయ్య స్వీకరించారు.ఈసందర్భంగా సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ బాధితుల సమస్యలను చట్టపరంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ ఆదేశించారు.అనంతరం అదనపు ఎస్పీ మాట్లాడుతూ.ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అదనపు ఎస్పీ తెలిపారు.

వాయిస్
హైదరాబాద్
మంగళవారం 30 జూన్ 2026



## పరమశివుడి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

జమ్మికుంట జూన్ 29 (వాయిస్ టుడే): జమ్మికుంట అన్నపూర్ణ సేవాసమితి వారి ఆధ్వర్యంలో వర్షాకాల సమయంలో సరైన వర్షాలు కురవడం లేదని పట్టణంలోని శివాలయం పరమశివుడికి అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిధిలో సరైన సమయానికి అవసరమైన వర్షాలు కురవడం లేదని శివాలయంలో అన్నపూర్ణ సేవాసమితి మరియు రెండు సేవాసమితి వారు మనకు ఏ కష్టం వచ్చినా ముందుగా చెప్పుకునే ఆ పరమశివుడికే అని తెలుపుతూ పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి సన్నిధిలో శివ పరాయణం భక్తులు భజనలతో ఆ పరమశివుడి అభిషేకం చేయడం జరిగిందని, ఆ పరమశివుడి దయతో జమ్మికుంట పట్టణ పరిధిలోని ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రజలు, యావత్ తెలంగాణ ప్రజలు అందరూ సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చందా రాజు, లెంకలపల్లి శరత్,యాంసాని సురేష్, రవీందర్ రెడ్డి, రఘు, చంద్రమౌళి శ్రీనివాస్, రాజన్న, శివశంకర్,అన్నపూర్ణ సేవాసమితి వారు, మరో రెండు సేవాసమితి వారు ఆలయ అర్చకులు శివ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే కుట్రలను సహించం

### జూలై 1 ధర్నాను విజయవంతం చేయాలి: వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెమడాల పరశురాములు డిమాండ్

వేములపల్లి, జూన్ 29:(వాయిస్ టుడే): తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం వేములపల్లి మండల కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రేముడాల పరశురాములు, పెంటమల్ల సుకన్య పాల్గొని కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ పేదల జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే లేదా కూలీల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త నిబంధనల వల్ల ఉపాధి కూలీల హక్కులు దెబ్బతింటాయని, ప్రస్తుతం అమలులో ఉన్న పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూలీలకు నష్టం కలిగించే కొత్త చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. జూలై 1న మండల కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ, ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రొండి శ్రీనివాస్ , పద్మ, సైదులు, శ్రీను ఉపాధి హామీ కూలీలు,వ్యవసాయకార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మూల్పూరు వెంకటరత్నం జీవితం విలువల రాజకీయాలకు నిదర్శనం: ఎమ్మెల్యే యార్లగడ్డ

కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): హనుమాన్ జంక్షన్: బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌లోని కాకాని కళ్యాణ మండపంలో దివంగత మూల్పూరు వెంకటరత్నం (మునసబు) సంస్మరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హాజరై వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ వెంకటరత్నం 1983 నుంచి తెలుగుదేశం పార్టీ పట్ల జీవితాంతం నిబద్ధతతో పనిచేసిన నాయకుడని కొనియాడారు. తాను వైసీపీలో ఉన్న సమయంలో కూడా వ్యక్తిగతంగా ఆప్యాయంగా మెలిగినా, పార్టీ పట్ల తన విధేయతను ఏమాత్రం విడిచిపెట్టలేదని గుర్తు చేశారు. రాజకీయాల్లో అభిప్రాయ భేదాలు సహజమేనని, కానీ పార్టీ పట్ల అంకితభావం, సిద్ధాంతాల పట్ల నిబద్ధత ప్రతి కార్యకర్తకు ఆదర్శమని అన్నారు. పోలవరం - ఏలూరు కాలువ అనుసంధానం రూ.38 కోట్ల నిధులు సాధించామని, అసెంబ్లీలో పోరాడి ఈ నిధులను తీసుకొచ్చానని అన్నారు. మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నానిలపై విమర్శలు చేస్తూ, కృష్ణా జిల్లా రాజకీయాలను భ్రష్టు పట్టించారని, జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ పతనానికి వారిద్దరి వైఖరే కారణమని ఆరోపించారు. అభివృద్ధిపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరిన ఆయన, తాను కుటిల రాజకీయాలు చేయనని, ప్రజల హక్కులు, పార్టీ కార్యకర్తల గౌరవాన్ని కాపాడేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. మంచి తనాన్ని చేతగానితనంగా భావించవద్దని హెచ్చరిస్తూ, మూల్పూరు వెంకటరత్నం రాజకీయ జీవితాన్ని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మునసబు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు.





## విజయవాడలో ఘనంగా షూటింగ్ బాల్

### కృష్ణాజిల్లా జట్ల ఎంపికలు

కృష్ణాజిల్లాబిగన్నవరం(వాయిస్ టుడే): కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని సత్యనారాయణపురం రైల్వే క్రీడా ప్రాంగణంలో సోమవారం సాయంత్రం జూనియర్ బాలబాలికల కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ జట్ల ఎంపికలు ఘనంగా నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి మొట్టమొదటి అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు , జిల్లా షూటింగ్ మాల్ సంఘ కార్యదర్శి విజయ్ కుమార్ గోగులమూడి తెలిపారు. ఈ ఎంపికులకు జిల్లా నలుమూలల నుండి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని విజయ్ తెలిపారు. ఇక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాల, బాలికలను కడప జిల్లాలోని పులివెందులలో జులై 11 , 12 తేదీలలో జరగబోయే తొమ్మిదవ రాష్ట్రస్థాయి పోటీలలో కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు. షూటింగ్ బాల్ క్రీడను క్రమం తప్పకుండా అభ్యసన చేసి జిల్లా ,రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి ఆసియా షూటింగ్ క్రీడలలో, ప్రపంచ కప్ షూటింగ్ బాల్ పోటీలలో అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే లోకో పైలట్ ఫణి, అంతర్జాతీయ షూటింగ్ బాల్ పతాక విజేత హనీత్ నాగ్, సీనియర్ క్రీడాకారులు కందుబుక్త సింధూర సాహితీ, షైక్ ఆశ తదితరులు పాల్గొన్నారు

## వేంపాడులో రూ.2 లక్షలతో బస్సు షెల్టర్ నిర్మాణం

### వేంపాడు బస్ షెల్టర్ ను ప్రారంభించిన ఆర్టీసీ అధికారులు

### దాత సహకారానికి గ్రామస్తుల అభినందనలు

కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): ఉంగుటూరు మండలం పరిధిలో వేంపాడు గ్రామంలో రెండు లక్షల రూపాయలతో బస్సు షెల్టర్ ను నిర్మించడం జరిగినది. దాతల సహకారంతో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన నూతన బస్సు షెల్టర్ ను సోమవారం ఆర్టీసీ అధికారులు, గ్రామ పెద్దలు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దాతలు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న బస్సు సౌకర్యం మరియు బస్ షెల్టర్ నిర్మాణం సంతోషకరంగా ఉందని అన్నారు. ఇకపై ప్రయాణికులు ఎండ, వర్షం నుండి రక్షణ పొందుతూ బస్సు ప్రయాణం కొరకు వేచి ఉండుటకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గన్నవరం బస్సు డిపో మేనేజర్ శివాజీ ,మరియు సూపర్వైజర్ మధు ,కంట్రోలర్ బాబురావు, పాల్గొన్నారు. గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కీ"శే మునగా కోటేశ్వరరావు (తండ్రి) కీ"శే మునగా వెంకటరత్నమ్మ (తల్లి) కీ" శే మునగా నాగమణి (భార్య) వారి జ్ఞాపకార్థంగా మునగా సుభాష్ చంద్రబోస్ బస్సు షెల్టర్ ను నిర్మించారు.



## మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ మాసాంతర సమావేశం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో కర్రా వరప్రసాద్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఈ నెలలో సంస్థ చేపట్టిన పలు సేవా కార్యక్రమాల నివేదికను సమర్పించి, వాటిపై సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ డైరెక్టర్ గా నూతనంగా నియమితులైన కలపాల శ్రీనివాసరావు (ఏజీఎం, పతంజలి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అంపాపురం), అలాగే కన్వీనర్ గా నియమింపబడిన శ్రీకాకుళపు సత్యనారాయణ (సాయి)లను ప్రతినిధులు దుస్సాలువాతో సముచితంగా సత్కరించారు. అనంతరం మానవతా శాంతి రథం చోదకుడు తిరివీధి కిషోర్ పిల్లల పుస్తకాల కొనుగోలు నిమిత్తం రూ. 5,000/- చెక్కును ఆర్థిక సహాయంగా అందజేశారు.ఈ సమావేశంలో చైర్మన్ మదుపల్లి బాలకృష్ణమూర్తి 2026-2027 సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా కర్రా వరప్రసాద్, కార్యదర్శిగా వడ్లమన్నాటి వెంకట కృష్ణ మోహన్, కోశాధికారిగా పొట్లూరి రామకృష్ణారావు ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా కొల్లి సత్య జగదీశ్వరరావు, సహాయ కార్యదర్శిగా కనకాల వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ డైరెక్టర్లుగా సయ్యద్ లాల్ (విద్య), మామిడి రాధిక (వైద్యం), యార్కా రెడ్డి సంజీవరెడ్డి (అవేర్నెస్), మోటమర్రి శేఖర్ (అత్యవసరం) నియమితులయ్యారు. చివరగా గౌరవ సలహాదారు ముక్కామల సుబ్బారావు వందన సమర్పణ చేయగా, జాతీయగీతం జనగణమన ఆలపనతో సమావేశం ముగిసింది.



## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. సిద్దం ఉజ్వల్‌రెడ్డి

ఝరాసంగం, జూన్, 29 (వాయిస్ టుడే) : జహీరాబాద్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాసిద్దం ఉజ్వల్‌రెడ్డి..... అధికారులను కోరారు.సోమవారం మండల పరిధిలోని బూర్ధిపాడ్,చిరాగ్‌పల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన ఇంటింటికి వెళ్లి సర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు, ఏజెంట్లతో మాట్లాడిన ఆయన.. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ప్రతి ఓటరు వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కచ్చితత్వంతో నిర్వర్తించాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో ఎన్యూమరేషన్ పనుల పురోగతిని ఆయన స్వయంగా పరిశీలించి, కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి పలు కీలక సూచనలు, మార్గదర్శకాలు అందజేశారు.వారితో పాటు సిడిసి చైర్మన్ ముబీన్,జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి,సర్పంచ్ లు మల్లికార్జున్,సునీల్(యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ,కౌన్సిలర్ అరుణ్ కుమార్,సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి,హన్మంత్ రెడ్డి,అశ్విన్ పాటిల్,ఇమామ్ పటేల్,దిలీప్ కుమార్,కిష్టారెడ్డి. బూత్ లెవల్ అధికారులు, ఏజెంట్లు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## సల్కనూరు సహకార సంఘంలో మొక్కలు నాటిన గడ్డం స్వాధర్ రెడ్డి

వేములపల్లి జూన్ 29 (వాయిస్ టుడే) : మండలములోని సల్కునూరు గ్రామంలో అంతర్జాతీయ సహకార వారోత్సవాల భాగంగా స్థానిక సహకార సంఘం ఆవరణలో సంఘ గౌరవ అధ్యక్షులు గడ్డం స్రువదర్ రెడ్డి మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఈ సందర్భంగా రైతులను గ్రామ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నారబోయిన సతీష్ ఉప సర్పంచ్ రాచమల్ల సైదులు సీఈవో వాకిటి సురేష్ సంఘం డైరెక్టర్లు ఆరాల లింగయ్య రవీందర్ రెడ్డి పందుల జానకిరాములు అలుగుబెల్లి సుధాకర్ రెడ్డిఅనుములపురి జయసుధ ఇబ్బంది ముక్కా వెంకన్న పసుల వేణు కొండ సాయి గ్రామ రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి : ఏఈవో ప్రియాంక



వేములపల్లి జూన్ 29 వాయిస్ టుడే) : మండలంలోని రావులపెంట, లక్ష్మీదేవిగూడెం, ఆమనగల్లు గ్రామాల పరిధిలోని రైతులు జూన్ 15వ తారీకు లోపు కొత్తగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏ.ఈ.ఓ మాలోతు ప్రియాంక సూచించారు.జూలై 5వ తేదీ లోపు రైతులు పట్టా పాస్ బుక్,ఆధార్ కార్డు,బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్ లు తీసుకొని వచ్చి దరఖాస్తు చేసుకోవాలని,మరింత సమాచారం కోసం 8977765763 నెంబర్ కు సంప్రదించాలని కోరారు.

## తుదిశ్వాస విడిచిన గుండెలమీద టీడీపీ జెండా ఉండాలన్న గోగులమూడి వెంకన్న



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): టీడీపీ స్థాపన నుండి కార్యకర్తగా కొనసాగుతున్న గన్నవరం మండలం, చిన్నఅవుటపల్లి గ్రామానికి చెందిన గోగులమూడి వెంకటేశ్వర రావు (వెంకన్న ) ఇటీవలే స్వర్గస్తులయ్యారు. తుది శ్వాస విడిచిన ఇటువంటి కరుడుగట్టిన టీడీపీ కార్యకర్త గుండెలపై టీడీపీ జెండా ఉండాలని గ్రామస్తులు టీడీపీ జెండాను పెట్టారు. స్వర్గీయ నందమూరి రామారావు అన్నా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నా వెంకన్న కు అమితామైన గౌరవమని పలువురు గ్రామస్తులు కొనియాడారు. అనంతరం మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగులమూడి రాజు పాల్గొని వెంకన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ పెద్దలు గోగులమూడి రత్న బాబు, దుర్గారావు, నీలం చిన్నోడు, మాల మహానాడు సభ్యులు అంథోని, భాస్కర్ తదితరులు కూడా వెంకన్నకు నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ టీడీపీ టీడీపీ నాయకులు మాట్లాడుతూ టీడీపీ జెండా కార్యకర్తల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని, పార్టీ కోసం ప్రాణాలర్పించిన వారి పట్ల, పార్టీ కోసం జీవితాంతం పనిచేసిన వారి పట్ల పార్టీ నాయకత్వం, క్యాడర్ చూపే గౌరవానికి ఈ మాటలు అద్దం పడతాయని అన్నారు

## సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం అభినందనీయం

### మండల విద్యాధికారి సిహెచ్ వెంకటమ్మ



మాడుగుల పల్లి జూన్ 29 (వాయిస్ టుడే): స్వామి యొక్క అక్షరాభ్యాసం నిర్వహించడం చాలా అభినందనీయమని మండల విద్యాధికారి సి ఎచ్ వెంకటమ్మ అన్నారు. సోమవారం మాడుగుల పల్లి మండలంలోని తోపుచర్ల గ్రామం లో ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షర అభ్యాసం నిర్వహించడం జరిగింది. మండల విద్యాధికారి ఎం ఈ ఓ సిహెచ్. వెంకటమ్మ ఫ్రీ ప్రైమరీ తరగతులకు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం సంతోషకరమని ప్రభుత్వ నాణ్యమైన విద్య అందించుట కొరకు ఫ్రీ ప్రైమరీ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ సిహెచ్ .వెంకటమ్మ , జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు వై.అరుణ కుమారి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి. రమేష్, సర్పంచ్ నన్నే బోయిన పార్వతి, గ్రామపంచాయతీ కార్యదర్శి పూసపాటి నరేష్, ఏ ఏ పీ సి చైర్మన్ ఎలీషమ్మా ఉపాధ్యాయులు వీర.గణేష్ కుమార్, జి.ప్రభాకర్ రెడ్డి, పి.పవిత, పి.నాగలక్ష్మి అంగన్వాడి టీచర్ చంద్రకళ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**